సాక్షి ఒడిశా

7

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,33,086లు వచ్చాయని అధికారులు తెలిపారు.



వికటించిన మాత్రలు!

- 8లో



విద్యార్థులందరికీ నులి పురుగుల మందు

- 8లో

న్యూస్‌రీల్‌

ఏడీఎంగా మహేశ్వర్‌ నాయక్‌



ఏడీఎం మహేశ్వర్‌ నాయక్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కొరాపుట్‌: నవరంగ్‌పూర్‌ జిల్లా అదనపు కలెక్టర్‌(ఏడీఎం)గా మహేశ్వర్‌చంద్ర నాయక్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మహేశ్వర్‌ రాయగడ జిల్లా వాసి కాగా, ఉద్యోగరీత్యా ఎక్కువకాలం కొరాపుట్‌, మల్కన్‌గిరి జిల్లాల్లో గడిపారు. అంతా కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

వీవీ గిరి సేవలు ఎనలేనివి

భువనేశ్వర్‌: భారత మాజీ రాష్ట్రపతి వీవీ గిరి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ ఆయనకు నివాళులర్పించారు. కార్మిక హక్కులు, సామాజిక సమానత్వం కోసం ఎనలేని కృషి చేశారని, స్వాతంత్ర్య సమరయోధుడిగా విశేషమైన పాత్ర పోషించారన్నారు. అవిభక్త గంజాం జిల్లా బరంపురంలో వీవీ గిరి జన్మించారు. ఖలీకోట్‌ కళాశాల పూర్వ విద్యార్థిగా గుర్తు చేశారు. దేశ 4వ రాష్ట్రపతిగా సర్వోన్నత పదవిలో కొనసాగారు. ఆయన జీవితకాల కృషికి తార్కాణంగా భారత ప్రభుత్వం భారతరత్నతో సత్కరించింది. గిరి భారత 3వ ఉప రాష్ట్రపతిగా కూడా సేవలందించారు.

గుణుపూర్‌ ఐఐసీగా ఉత్తమ్‌ సాహు



ఐఐసీగా ఉత్తమ్‌కుమార్‌ సాహు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌ ఆదర్శ పోలీస్‌ స్టేషన్‌ ఐఐసీగా ఉత్తమకుమార్‌ సాహు బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కలహండి జిల్లా లంజిఘడ్‌లో ఐఐసీగా విధులు నిర్వహిస్తుండేవారు. ట్రాఫిక్‌ నియంత్రణ, దొంగతనాల నివారణ వంటి వాటిపై శ్రద్ధ చూపిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

మునిగుడ హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు



నిబంధనలు పాటించని హోటల్‌ యజమానులకు జరిమానా విధిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని మునిగుడలో హోటళ్లు, రెస్టారెంట్లలో గుణుపూర్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ పంకాజాని డెహురి గురువారం ఆకస్మికంగా దాడులు చేపట్టారు. పోలీసులు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని పలువురు యజమానులకు జరిమానా విధించారు. ఆహారం విషయంలో సరైన నాణ్యత పాటించక పోవడం, హోటల్‌ బయట ధరల పట్టిక వంటివి లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొన్ని హోటళ్లలో నేరుగా కిచెన్‌ లోకి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. ఇకపై తరచూ తనిఖీలు నిర్వహిస్తామని, శుభ్రతా, నాణ్యత పాటించాలని సూచించారు.

‘మహేంద్రగిరికి నిధులు మంజూరు చేయాలి’



ఎంపీ చంద్రశేఖర సాహు

పర్లాకిమిడి: దేశంలో రామాయణ ఇతిహాసానికి సంబంధించి రాముడు పర్యటించిన 15పవిత్ర స్థలాలను దర్శన పథకంలో చేర్చి, అభివృద్ధి చేస్తామని కేంద్ర పర్యాటక శాఖ గతంలో ప్రకటించింది. అయితే ఈ జాబితాలో ఒడిశాలోని మహేంద్రగిరి అభివృద్ధికి నోచుకోలేదని, దీనికి నిధులు కేటాయించాల్సిందిగా రెండేళ్లుగా కోరుతున్నానని బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు విచారం వ్యక్తంచేశారు. చిత్రకూట్‌, శ్రింగవరపూర్‌కు నిధులు మంజూరు చేశారని, మహేంద్రగిరిని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు మహేంద్రగిరి పవిత్ర స్థలాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా కేంద్ర పర్యాటక శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు.

సర్పదోషం!



- పాము కాటుతో గత ఏడేళ్లలో 6,351మంది మృతి
- ఇతర ప్రమాద మరణాలు 40శాతమే
- ఇకపై పాముల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్రప్రభుత్వం

ప్రజలకు అవగాహన..

✓ ఇళ్లలో, జన సందోహిత ప్రాంతాల్లో పాము కనిపిస్తే దానిని రక్షించేందుకు సత్వర చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.
✓ పర్యావరణంలో సర్పాల ప్రాముఖ్యతపై పాములు పట్టే వారు(స్నేక్‌ క్యాచర్‌) ప్రజలకు అవగాహన కల్పిస్తారు.
✓ వాటిని పట్టుకుని విన్యాసాలు, ఇతరేతర ప్రదర్శనలు, చేష్టల్ని చట్ట వ్యతిరేకంగా పరిగణించి చర్యలు చేపడతారు.
✓ పాముల సంచారం తారస పడితే తక్షణమే పాములు పట్టే వారికి ఫోన్‌ చేయడంతో పాము ఫొటోను కూడ పంపించాల్సి ఉంటుంది. ఫోన్‌ సమాచారం అందడంతో తక్షణమే ఘటనా స్థలం సందర్శించలేని పరిస్థితుల్లో స్నేక్‌ క్యాచర్‌లు చేరే సమయాన్ని అంచనాగా తెలియజేస్తారు.

భువనేశ్వర్‌: రాష్ట్రంలో పాముకాటు ప్రాణాంతకంగా పరిణమించింది. నానాటికి ఈ జాబితా మరణాలు పెరుగుతున్నాయి. ప్రమాదకర మరణాలలో 40శాతం మంది పాముకాటు కారణంగానే జరుగుతున్నాయి. గత 7 ఏళ్లలో 6,351మంది పాము కాటు కారణంగా మృతిచెందారు. ఇది ప్రాణాంతకం కావడంతో భయాందోళనలకు గురై ప్రజలు సర్పాలను హతమార్చుతున్నారు. ఈ లెక్కన పాముల మరణాలు గణనీయంగా పుంజుకుంటున్నాయి. ఈ జాతి కనుమరుగై పోయే విపత్కర పరిస్థితి తలెత్తక ముందే జాగ్రత్త వహించాలనే యోచనని రాష్ట్రప్రభుత్వం కార్యాచరణలోకి తెచ్చింది. పాములను రక్షించేందుకు అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. జనావాస ప్రాంతాల్లో పాము తారస పడటంతో బెంబేలెత్తుతున్న స్థానికులు పాములను సురక్షితంగా అదుపులోకి తీసుకుని వాటికి అనుకూలమైన పర్యావరణంలో విడిచి పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు తరచూ బెడిసి కొడుతున్నాయి. ఈ చర్యలు చేపట్టే స్నేక్‌ హెల్ప్‌లైన్‌ వర్గాలు అందుబాటులో ఉండటం లేదు. ఈ వర్గం సకాలంలో అందుబాటులోకి వస్తే పాములకు ప్రాణహాని తప్పి, ప్రజలకు పాముకాటు మరణం నుంచి రక్షణ లభిస్తుంది. మరికొన్ని పరిస్థితులు, సందర్భాల్లో విచారకర పరిస్థితులు పాములకు తీవ్రహాని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల నివారణకు అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయడం విశేషం.

నిపుణులైన వారితో..

పాము సంచారం తారసపడితే ప్రజలు స్నేక్‌ హెల్ప్‌లైన్‌కు ఫోన్‌ చేసినా సిబ్బంది కొరత కారణంగా అనుబంధ వర్గాలు సకాలంలో వినియోగ పడటంలేదు. ఘటనా స్థలానికి ఈ వర్గాలు చేరే సమయానికి, ప్రజలు పామును కొట్టి చంపుతున్నారు. కొన్నిచోట్ల సర్పాలను కాపాడే వారు మృత్యువాతకు గురవుతున్నారు. వీటిని అదుపులోకి తీసుకునేందుకు అవసరమైన పరికరాలు, అనుబంధ సరంజామా లేకుండా చేస్తున్న ప్రయత్నాలు ఈ విపత్కర పరిస్థితుల్ని ప్రేరేపిస్తున్నట్లు విభాగం గుర్తించింది. ఈ పరిస్థితుల నివారణకు సర్పాలను అదుపులోకి తీసుకునేందుకు ప్రభుత్వం నిపుణులైన స్నేక్‌ క్యాచర్‌ల వర్గాన్ని బలోపేతం చేసేందుకు నడుం బిగించింది. వీరికి జారీ చేసిన మార్గదర్శకాల ఉల్లంఘనకు పాల్పడితే వారి వ్యతిరేకంగా వన్యప్రాణి(సంరక్షణ) చట్టం-1972 ప్రకారం చర్యలు తీసుకుంటారని విభాగం హెచ్చరించింది.

ఇదీ విధానం..



- పాముకాటుకు గురైన విపత్కర పరిస్థితులను వీరి కి ఫోన్‌ ద్వారా తెలియజేస్తే స్థానికంగా పాము కాటు చికిత్సకు అనుబంధ ఏర్పాట్లు, సౌకర్యం కల్పించడంలో సహకరిస్తారు.
- జన సందోహిత, ప్రజలకు భయాందోళన కలిగించే పరిసరాల నుంచి అదుపులోకి తీసుకున్న పామును సురక్షితంగా అటవీ పర్యావరణంలో విడిచి పెడతారు. ఇంతలో పాముకు గాయమైతే చికిత్స చేసి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టాల్సి ఉంటుంది.
- ఒక ప్రాంతంలో అదుపులోకి తీసుకునే పామును ఒకే అటవీ ప్రాంతంలో విడిచి పెట్టకుండా స్వేచ్ఛగా తిరుగాడేందుకు వేర్వేరు ప్రాంతాల్లో విడిచి పెట్టాల్సి ఉంటుందని తాజా మార్గదర్శకాలు పేర్కొన్నాయి.
- పాములు పట్టేవారికి బీమా కల్పిస్తారు. సర్టిఫైడ్‌ స్నేక్‌ క్యాచర్‌ కావడానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఏసీఎఫ్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఔత్సాహిక అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన మేరకు ఖరారు చేసి జాబితా వెల్లడిస్తుంది.
- 65ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వ్యక్తులకు మాత్రమే ఈ మేరకు లైసెన్స్‌ మంజూరు చేస్తారు.
- సర్టిఫైడ్‌ స్నేక్‌ హ్యాండ్లర్లు పీవీసీ పైప్‌, బ్యాగ్‌, ఫస్ట్‌ఎయిడ్‌ కిట్‌,టార్చ్‌, హెడ్‌ల్యాంప్‌, పాముకాటు బ్యాండేజీలు, పాము హుక్‌, ఫ్రేమ్డ్‌ క్లాత్‌ బ్యాగ్‌, స్నేక్‌బ్యాగ్‌ తదితర వ్యక్తిగత రక్షణ పరికరాలతో రంగంలోకి దిగడం అనివార్యంగా సూచించారు.

పర్లాకిమిడిలో హోటళ్లు బంద్‌

- మున్సిపల్‌ అధికారుల తీరుపై చిరు వ్యాపారుల నిరసన



ఈఓ శత్పతితో మాట్లాడుతున్న హోటళ్ల యజమానులు

పర్లాకిమిడి: పట్టణంలోని హోటళ్లు, తోపుడు బళ్లపై టిఫిన్లు విక్రయించే వారు గురువారం తమ వ్యాపారాలను మూసివేశారు. పట్టణంలో పాలిథిన్‌ సంచులు నిషేధించడంతో వాటిని వినియోగిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌, కిరాణా దుకాణాలపై మున్సిపల్‌ అధికారులు గత కొన్ని రోజులుగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై జరిమానాలు విధించారు. దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ టిఫిన్‌ దుకాణాలను మూసి వేశారు. ఈ మేరకు చిరు వ్యాపారులంతా కలిసి మున్సిపల్‌ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ ఈఓ వనమాలి శత్పతి కలుగజేసుకొని, వారితో మాట్లాడారు. దుకాణాలతో చట్నీ, కూరలు ఎలా పార్శిల్‌ చేస్తామని, వ్యాపారాలను దెబ్బతీస్తే ఎలా బతికాలని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆయన.. కొద్ది రోజులు గడువు ఇస్తామని, ఈలోగా ఫుడ్‌సేఫ్టీ నుంచి లైసెన్సులు, హోల్డింగ్‌ పన్నులు చెల్లించాలని సూచించారు. అలాగే పాలిథిన్‌ వినియోగంపై రాష్ట్ర అధికారులతో మాట్లాడి, నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

పతాకావిష్కరణకు మంత్రులు



- జిల్లాలకు ఇన్‌చార్జిలను ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం
- భువనేశ్వర్‌లో జెండా ఎగుర వేయనున్న సీఎం నవీన్‌ పట్నాయక్‌

జెండా ఎగురవేయనున్న మంత్రులు	
జిల్లా	మంత్రి
కంధమాల్‌	జగన్నాథ సరకా
పూరీ	నిరంజన్‌ పూజారి
కొరాపుట్‌	రణేంద్రప్రతాప్‌ స్వాయి
గంజాం	ప్రదీప్‌కుమార్‌ ఆమత్‌
బర్‌గడ్‌	ప్రమీలా మల్లిక్‌
సంబల్‌పూర్‌	ఉషా దేవి
కెంజొహర్‌	ప్రఫుల్లకుమార్‌ మల్లిక్‌
అంగుల్‌	ప్రతాప్‌కేశరి దేవ్‌
రాయగడ	అతున్‌ సబ్యసాచి నాయక్‌
జగత్‌సింగ్‌పూర్‌	టుకుని సాహు
బొలంగీర్‌	అశోక్‌చంద్ర పండా
సుందర్‌గడ్‌	రాజేంద్ర ధోలాకియా
కటక్‌	విక్రమకేశరి అరుఖ్‌
బాలాసోర్‌	సుధామ్‌ మరాండి
ఝార్సుగుడ	శారదాప్రసాద్‌ నాయక్‌
మయూర్‌భంజ్‌	అశ్వినికుమార్‌ పాత్రొ
కలహండి	ప్రీతిరంజన్‌ ఘొడై
సోన్‌పూర్‌	రీటా సాహు
డెంకనాల్‌	బసంతి హెంబ్రామ్‌

భువనేశ్వర్‌: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పరేడ్‌లో ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 15న వివిధ ప్రాంతాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించే మంత్రులు, ఇతర ప్రముఖుల జాబితాను రాష్ట్రప్రభుత్వం గురువారం విడుదల చేసింది. బరంపురంలో ఆర్‌డీసీ(దక్షిణ విభాగం), రౌర్కెలాలో ఆర్‌డీసీ(ఉత్తర విభాగం) జాతీయ పతాకాన్ని ఎగురు వేయనున్నారు. భద్రక్‌, బౌధ్‌, దేవ్‌గడ్‌, గజపతి, జాజ్‌పూర్‌, కేంద్రాపడా, ఖుర్దా, నువాపడా, నవరంగ్‌పూర్‌, నయాగఢ్‌ జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ఆయా ప్రాంతాల కలెక్టర్లు కవాతులో పాల్గొని, గౌరవ వందనం స్వీకరిస్తారు.

ఉత్తమ పనితీరుకు.. ‘ఓస్వాస్‌’



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌ విశాల్‌సింగ్‌, అధికారులు

మల్కన్‌గిరి: ఉద్యోగుల్లో పనితీరు మెరుగు పరిచేందుకు ఓస్వాస్‌ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని కలెక్టర్‌ విశాల్‌సింగ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఓస్వాస్‌ మిషన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆన్‌లైన్‌ సేవల ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పనితీరు మెరుగు పడటంతో పాటు, ఉద్యోగుల సామర్థ్యం, పారదర్శకత మెరుగు పడుతుందని తెలిపారు. అలాగే సేవల్లో భారీ జాప్యాన్ని నివరించవచ్చన్నారు. రానున్న 6 నెలల్లో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. ముందుగా దీనిపై శిక్షణ ఇవ్వడం కోసం భువనేశ్వర్‌ నుంచి ప్రత్యేక బృందం మల్కన్‌గిరికి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ త్రినాథ్‌ మాఝి, ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

కొలుకున్న సబ్‌ కలెక్టర్‌



కుహోరొను పరామర్శిస్తున్న జీఐఈటీ డైరెక్టర్‌ పండా

రాయగడ: గత శుక్రవారం గుండెపోటుకు గురై, శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుణుపూర్‌ సబ్‌ కలెక్టర్‌ లలిత్‌కుమార్‌ కుహోరా కోలుకున్నారని జిల్లా అధికార వర్గాలు పేర్కొన్నాయి. వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆరోగ్యం నిలకడగా ఉందని డిశ్చార్జి చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన గుణుపూర్‌కు చేరుకున్నారు. సబ్‌ కలెక్టర్‌ను జీఐఈటీ డైరెక్టర్‌ చంద్రధ్వజ పండా తదితరులు పరామర్శించారు. తన కార్యాలయంలో గత శుక్రవారం విధులు నిర్వహిస్తున్న సబ్‌ కలెక్టర్‌.. హఠాత్తుగా గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చేరారు. త్వరలో ఆయన తిరిగి విధుల్లో చేరుతారని సమాచారం.

మాజీ ఎమ్మెల్యే నివేదిత ప్రధాన్‌ మృతి



నివేదిత ప్రధాన్‌

భువనేశ్వర్‌: కటక్‌ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, భారతీయ జనతాపార్టీ నాయకురాలు, ప్రముఖ న్యాయవాది నివేదిత ప్రధాన్‌ కన్ను మూశారు. కటక్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులతో సంఘ సేవకులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, న్యాయవాదులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కటక్‌ నగరపాలక సంస్థ(సీఎంసీ) తొలి మహిళా కార్పొరేటర్‌గా ప్రత్యేకత పొందారు.

ఉపాధ్యాయులను రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌



డీఓఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

రాయగడ: జిల్లాలోని విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్‌ చేయాలని మల్టీ లాగ్వేల్‌(ఎంఎల్‌ఈ) జూనియర్‌ ఉపాధ్యాయులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఇదే హోదా కలిగిన 191మంది ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. అనంతరం విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భోరియాకు వినతిపత్రం సమర్పించారు. గత పదేళ్లుగా వివిధ గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం ఇంతవరకు రెగ్యులర్‌ చేయకపోవడంతో తమకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని ఉపాధ్యయులు గంగారవు నచిక, సాలొంతి అట్టక, అనురాధ సావంత వివరించారు. ఇతర ఉపాధ్యాయుల తరహాలోనే తాము కూడా విధులు నిర్వహిస్తున్నా తమకు మాత్రం కేవలం రూ.14,300ల వేతనం మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో దినదిన గండంగా మారిందన్నారు. కొరాపుట్‌ తోపాటు మరో 6జిల్లాల్లోని ఎంఎల్‌ఈ-జూనియర్‌ ఉపాధ్యయులకు ఇప్పటికే రెగ్యులర్‌గా ప్రభుత్వం గుర్తించిందని, రాయగడ జిల్లాలో మాత్రం ఎందుకు వివక్ష చూపిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్‌ను ఆమోదించాలని కోరారు.

సారాతో ఇద్దరి అరెస్ట్‌



సారా దాడుల్లో పట్టుబడిన నిందితులు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్‌ సమితి సింగిపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది గురువారం దాడులు చేపట్టారు. ఇందులో 800లీటర్ల సారా ప్యాకెట్లు, నిల్వ ఉంచిన మరో 100లీటర్ల సారాను స్వాధీనం చేసుకొనిధ్వంసం చేశారు. దాడుల్లో ఇద్దరు నిందితులు పట్టుబడగా, వారిని అరెస్ట్‌ చేసి, కోర్టులో హాజర పరిచారు. వారి వద్ద నుంచి స్కూటీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్‌శాఖ అధికారి ప్రకాష్‌ సాహు, ఏఎస్‌ఐ లింగరాజ్‌ దామి, సురేష్‌చంద్ర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న రైలు



రైలు ముందు భాగంలో నుజ్జయి ఉన్న అంబులెన్స్‌

రాయగడ: రాయగడ నుంచి సంబల్‌పూర్‌కు వెళ్లే తపస్విని ఎక్స్‌ప్రెస్‌ తెరువలి రైల్వేస్టేషన్‌కు సమీపంలోని బృందావడి వద్ద అంబులెన్స్‌ను ఢీ కొట్టింది. గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనలో ప్రాణాపాయం లేకపోయినా, అంబులెన్స్‌ ముందుభాగం తుక్కు తుక్కయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా మో పరివార్‌కు చెందిన అంబులెన్స్‌ జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌ నుంచి రోగిని బిసంకటక్‌ లోని ఓ ప్రైవేటు చేర్చి తిరిగి పయనమైంది. ఈ సమయంలో బృందావడి వద్ద ఉన్న రైల్వేలైన్‌ దాటుతున్న సమయంలో రాయగడ నుంచి సంబల్‌పూర్‌కు వెళ్లే తపస్విని ఎక్స్‌ప్రెస్‌ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోయినప్పటికీ రైలును 20 నిమిషాలు ఘటనా స్థలంలోనే నిలిపివేశారు. సమీపంలోని గ్రామస్తులు అంబులెన్స్‌ను ట్రాక్‌పై నుంచి పక్కకు తొలగించడంతో ఎక్స్‌ప్రెస్‌ ప్రయాణాన్ని కొనసాగించింది.

ఆప్టికల్‌ ఫైబర్‌ కేబుల్‌ పూర్తి చేయండి



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ రమేష్‌ మాఝి

- లోక్‌సభలో ఎంపీ రమేష్‌ మాఝి

కొరాపుట్‌: ఉమ్మడి కొరాపుట్‌ జిల్లాలైన కొరాపుట్‌, నవరంగ్‌పూర్‌, మల్కన్‌గిరి జిల్లాల్లో ఆప్టికల్‌ ఫైబర్‌ కేబుల్‌ నిర్మాణ పనులు పూర్తి చేయాలని నవరంగ్‌పూర్‌ పార్లమెంట్‌ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝి కోరారు. లోక్‌సభలో ఆయన గురువారం మాట్లాడుతూ తన ప్రాంతంలోని జిల్లాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయన్నారు. మావోయిస్టుల ప్రభావానికి గురై ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. మూడు జిల్లాల్లోని ప్రతి పంచాయతీకి ప్రభుత్వం ఎప్పటి లోగా ఆప్టికల్‌ ఫైబర్‌ కేబుల్‌ నిర్మాణం పూర్తి చేస్తుందని ప్రశ్నించారు. దీనిపై కేంద్రమంత్రి దేవాన్స్‌ చౌహన్‌ సమాధానం ఇస్తూ ఈ ఏడాది డిసెంబర్‌ లోగా దేశవ్యాప్తంగా 3వ విడత కేబుల్‌ నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. ఆ గడువు లోగా పై మూడు జిల్లాల్లో కేబుల్‌ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

క్లుప్తంగా

ముగిసిన ఫైనల్ పోటీలు



వక్తృత్వ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, క్విజ్, వ్యాసరచన ఫైనల్ పోటీలు గురువారంతో ముగిశాయి. నూతన విద్యావిధానం, నవరత్నాలు అమలు- పేదలు జీవితంలో వెలుగులు అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈనెల 8, 9వ తేదీల్లో మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థుల వివరాలు జిల్లా విద్యాశాఖకు అందజేశారు. వర్సిటీలో ఆగస్టు 15న జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని అధికారులు తెలిపారు.

తూర్పుకాపు సంఘ జాతీయ గౌరవాధ్యక్షుడిగా పతివాడ



గిరీశ్వరరావు

నరసన్నపేట: స్థానిక పురుషోత్తంనగర్‌కు చెందిన పతివాడ గిరీశ్వరరావు ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ గౌరవ అధ్యక్షునిగా ఎంపిక య్యారు. ఈ మేరకు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా గిరీశ్వరరావును పలువురు నాయకులు అభినందించారు.

రిమ్స్ ఆర్‌ఎంవోగా విధుల్లో చేరిన శంకరరావు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆర్‌ఎంవోగా డాక్టర్ శంకరరావు గురువారం విధుల్లో చేరారు. కొద్దిరోజుల క్రితం పలు వివాదాస్పద సంఘటనలకు కేంద్ర బిందువుగా ఉన్నారని శంకరరావును జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిమ్స్ సూపరింటెండెంట్ ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టును ఆశ్రయించిన శంకరరావు స్టే రావడంతో గురువారం విధుల్లో చేరారు. అయితే డీఎంఈ నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోవడంతో రిమ్స్ అధికారులు ఆయనను చేర్చుకోవడంలో తర్జనభర్జన పడ్డారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించగా అక్కడి నుంచి సమాధానం రాకముందే శంకరరావు విధుల్లో తాను చేరుతున్నట్లు రిమ్స్ అధికారులకు తెలిపి రిజిస్టర్‌లో సంతకం చేశారు. శుక్రవారం దీనిపై రాష్ట్ర స్థాయి నుంచి వివరణ వచ్చే అవకాశం ఉంది.

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పర్యటన నేడు

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాంలు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్టు మంగళగిరి కమిషన్ కార్యాలయం కార్యదర్శి టీవీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత టూర్ షెడ్యూల్ సమాచారాన్ని కలెక్టర్, జిల్లా ఎస్పీలకు చేరవేశారు. ఉదయం 9.30కు జిల్లాలో ఒక కేజీబీవీ స్కూల్‌ను పరిశీలిస్తారు. 10.30 గంటలకు శ్రీకాకుళ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత స్కూళ్లు, ప్రైవేటు కాలేజీలు పరిశీలిస్తారు.

17నుంచి శ్రావణ మాస ఉత్సవాలు



బాలా త్రిపురసుందరీ దేవి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో గల బాలత్రిపుర కాల భైరవ పీఠం దేవాలయంలో ఈ నెల 17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయని పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఐదు వేళల్లో కుంకుమ పూజలు జరుగుతాయని, మహిళలు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



సాయిబాబా

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న ఏపీ హెచ్‌బీ కాలనీలో షిరిడీ సాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ నుంచితీసుకువచ్చిన వస్త్రాలతో బాబాను అలంకరించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీనివాసశర్మ, కిరణ్‌శర్మల నేతృత్వంలో క్షీరాభిషేకాలు నిర్వహించారు.

వికటించిన మాత్రలు!

- ఆల్బెండజోల్ వేసుకున్న కొద్ది సేపటికే విద్యార్థుల అవస్థలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

భువనేశ్వర్: నులిపురుగుల నివారణ కార్యక్రమం తొలిరోజు బెడిసి కొట్టింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలాసోర్ జిల్లాలోని ఓ పాఠశాలలో నులి పురుగుల మందు తీసుకున్న 8మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బొస్తా గుడిఖొల బొనొ బిహారిలాల్ పాఠశాలలో సుమారు 360మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారు. వీటిని వేసుకున్న కొద్ది సేపటికే కొంతమంది విద్యార్థులకు తల తిరగడం, కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. కొందరు విద్యార్థులు వాంతులు చేసుకోగా, ఆరుగురు బాలికలు, ఇద్దరు బాలురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో వీరందరినీ పాఠశాల సిబ్బంది సత్వర చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బొస్తాలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)నికి తరలించారు. చికిత్స అందించడంతో పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. రాష్ట్రంలోని పాఠశాలల ఆధ్వర్యంలో సుమారు కోటి మంది బాలలకు నులి పురుగుల మందులు చేరేలా అంగన్‌వాడీ కార్యకర్తలను రంగంలోకి దింపినట్లు రాష్ట్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ తెలిపింది.

'మదిలో మది' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ



ట్రైలర్ ఆవిష్కరణలో చిత్రబృందం, నాయకులు

శ్రీకాకుళం కల్చరల్: ధర్మాన హేమలత బ్యానర్‌పై నిర్మించిన 'మదిలో మది' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ గురువారం బాపూజీ కళామందిర్‌లో సందడిగా సాగింది. దర్శకుడు ప్రకాశ్ పల్ల మాట్లాడుతూ మంచి ప్రేమకథా చిత్రమని, ఆగస్టు 18న సినిమా థియేటర్స్‌లో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ధర్మాన రామమనోహర్‌నాయుడు ఆశీస్సులతో చిత్ర నిర్మాణం జరిగిందని చెప్పారు. కథానాయకుడుగా నేమకూరి జయ్‌కుమార్, సహ దర్శకుడు ప్రదీప్ నావి, సంగీతం షారూఖ్, ప్రమోషన్ మేనేజర్‌గా పట్ట జనార్దనరావులు పనిచేశారని తెలిపారు. సినిమాను అందరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ఎం.వి.స్వరూప్, జేసీఐ గ్రీన్‌సిటీ ప్రతినిధులు పొలిశెట్టి మధుబాబు పాల్గొన్నారు.

నాన్నా.. చనిపోతున్నా..!

- అనారోగ్యంతో కుప్పకూలి మృతిచెందిన పంచాయతీ కార్యదర్శి స్పందన



కొత్తపల్లి స్పందన (ఫైల్)

మందస/పలాస: మందస మండలం బిన్నళమదనాపురం పంచాయతీ వెంకటవరదరాజపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి స్పందన(30) తలసేమియా, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ బుధవారం రాత్రి మరణించారు. ఈమె పలాస మండలం మాకన్నపల్లి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించేవా రు. పుట్టుకతో తలసేమియా వ్యాధితో బాధపడుతు న్న స్పందనకు రెండేళ్ల క్రితం కిడ్నీవ్యాధి సోకింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, పలాస తదితర ప్రాంతా ల్లో చికిత్స తీసుకుంటున్నారు. బుధవారం వరకు విధులు నిర్వహించారు. ఆమె పరిధిలో గల చిన్నసీలావతిలో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న స్పందన ఇంటికి వెళ్లిన తర్వాత రాత్రి 10 గంటల సమయంలో ద్రవాహారం తీసుకుంటూ..'నాన్నా.. నేను చనిపోతున్నాను..' అని బాధతో చెప్పి ఒక్కసారిగా కుప్పకూలి మరణించారు. కళ్లదుటే కుమార్తె మరణించడంతో తల్లిదండ్రులు హేమారావు, వాణిప్రసన్న కన్నీరు మున్నీరు గా విలపించారు. వాణిప్రసన్న పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీలో కార్యదర్శిగా పని చేస్తున్నారు. సోదరి మోనిక ఎంబీబీఎస్, సోదరుడు సాయి బీటెక్ చేశారు. గురువారం స్వగ్రామమైన వీవీఆర్‌పురంలో అంత్యక్రియలు జరిగాయి. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెంబ వాసు దేవరావు, వై.తులసీదాసు, సంక కాళిదాసు, బడియా వల్లభరా వు, ఇప్పిలి చంద్రశేఖర్, తలగాన హేమారావు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని స్పందన కుటుంబానికి సంతాపం తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పోలాకి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పోలాకి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు ఆర్.శ్రీనివాసరావు విష్కరించారు. అధ్యయనం, అధ్యాపకం, సామాజిక స్పృహ అనే లక్ష్యాలతో ఏర్పడి న యూటీఎఫ్.. ఆ దిశగా అలుపెరగని పోరాటాలు చేస్తోందని పలువురు వక్తలు అన్నారు.

కొత్తూరు: యూటీఎఫ్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ఆర్.కొండలరావు ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, కొత్తూరు మండల శాఖ అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ ఆవరణలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు పిలుపునిచ్చా రు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జునైద్ అహ్మద్ మౌలానా చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నేటి నుంచి సంపూర్ణ శతావధానం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు జరిగే సంపూర్ణ శతావధానం కోసం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏలూరుకు చెందిన అష్టావధాని వద్దిపర్తి పద్మాకర్ 24 మంది పృచ్ఛకులకు రెండురోజులు సమాధానాలు ఇస్తూ మూడో రోజున శతావధాన పద్యధారణ నిర్వహి స్తారని నిర్వాహకులు తెలిపారు. ముగింపు సభకు శాసన సభాపతి తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరవుతారని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సత్యనారాయణ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. వాంబేకాలనీకి చెందిన రాజాపంతుల ధనలక్ష్మికి ఇద్దరు వివాహమైన కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు సత్యనారాయణ (30) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి అక్రమంగా మద్యం తెస్తూ పాతపట్నం పోలీసులకు చిక్కాడు. ఎక్సైజ్ కేసు నమోదవ్వడంతో వాయిదాలకు తిరుగుతుండేవాడు. మద్యం ఇదివరకే అలవాటు ఉండటం, పనికి వెళ్లకుండా ఎక్కడికక్కడ అప్పులు వాడుకోవడం, ఇంటి నిర్మాణానికి అప్పు వాడటం .. వారంతా అడుగుతుండటంతో ఎప్పుడూ దిగాలుగా ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం వరండాలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనాలు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పద్మనాభపురం పాత జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జయరామచంద్రపురం గ్రామానికి చెందిన యువకుడు, మాకన్నపల్లికి చెందిన మరో యువకుడు గాయపడటంతో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల తప్పిదాలను సరిచేయాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీలలో జరిగిన తప్పిదాలను తక్షణమే సరిచేసి నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు ఎస్.నరసింగరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బదిలీలు, ప్రమోషన్లలో నూతన పాఠశాలలకు చేరిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు జీతాలు అందలేదని గుర్తు చేశారు. అనంతరం నూతన డీఈవో కె.వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపి, వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర కార్యదర్శి పైడి కాశీ విశ్వనాథ్, బి.గోవిందరావు, డి.శివరాంప్రసాద్, ఎస్.గౌరీ నాయుడు పాల్గొన్నారు.

'నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే'



టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు తదితరులు

టెక్కలి: ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేస్తున్న రేషన్ బియ్యంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న భోజనాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు వెల్లడించారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో గురువారం ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులంతా ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా స్థానిక గొల్లవీధిలో గల 114 నంబర్ రేషన్ డిపోను పరిశీలించి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టాకు వివరాల్లో 6 బియ్యం బస్తాలు వ్యత్యాసం ఉండడంతో డిపోను సీజ్ చేయాలని ఆదేశించారు. అలాగే డిపోకు చెందిన ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. స్టాకు వివరాలు లేకపోవడం, పంచదార అందుబాటులో లేకపోవడంతో ఆపరేటర్‌కు నోటీసులు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అనంతరం గొల్లవీధి, ఆదిఆంధ్రావీధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. గొల్లవీధిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల కోసం వండిన పప్పు సక్రమంగా లేకపోవడం, స్టాకు వివరాలు సక్రమంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే కార్యకర్త నిర్మలకు మెమో అందజేయాలని ఆయన ఆదేశించారు. అక్కడ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రస్తుతం టమాటా అధిక ధరలు ఉన్నప్పటికీ విద్యార్థులకు చట్నీ పెట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఆయనతోపాటు డీఎస్ఓ డి.వెంకటరమణ, తహసీల్దారు కె.ప్రవల్లిక ప్రియ, డీఎంసీ సహాయ మేనేజర్ దామోదర్రావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.లక్ష్మి తో పాటు తూనికలు కొలతల శాఖాధికారులు, ఐసీడీఎస్, సంక్షేమ వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ నులి పురుగుల మందు



విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న ఏడీఎం రాజేంద్ర మింజ్

- డాక్టర్ మహేంద్రకుమార్ భుయ్యాన్



వేదికపై ఏడీఎం, ఇతర అధికారులు, వైద్యులు

పర్లాకిమిడి: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మహేంద్రగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ఔషధాలు, మాత్రలు పంచిపెట్టారు. కార్యక్రమాన్ని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించగా.. అదనపు పీహెచ్‌ఓ డాక్టర్ మహేంద్రకుమార్ భుయ్యాన్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో జీవన నాణ్యత తగ్గి శారీరక, మానసిక ఎదుగుదల తగ్గిపోతుందని తెలిపారు. ఏడాది వయస్సు నుంచి 19ఏళ్ల వయస్సు కలిగిన బాలలకు అంగన్‌వాడీ, స్వాస్థ్య కేంద్రాలు, పాఠశాలల్లో ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మాత్రలు ఎవరికి లభించకపోయినా ఆగస్టు 17వరకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పిల్లలు ఆడుకున్న తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఆరుబయట మలవిసర్జన చేయకుండా మరుగుదొడ్డినే వినియోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేంద్రగిరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పూర్ణచంద్ర ప్రధాన్, జిల్లా స్వస్థమిషన్ మేనేజర్ సౌమ్యరాణి గౌడొ, డాక్టర్ నేత్రానంద ప్రధాన్ పాల్గొన్నారు.

25కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితుడితో పోలీసులు

బరంపురం: స్థానిక నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 25కిలోల గంజాయిని సురడా పోలీసు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి ప్రసన్న నాయక్ అందించిన సమాచారం ప్రకారం కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు సురడా పోలీసులు మార్గం మధ్యలో రెక్కీ నిర్వహించి, వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. అటుగా వస్తున్న కారును సోదా చేయగా, 25కిలోల గంజాయి బయటపడింది. దీంతో డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఐఐసీ వివరించారు.

11 ఓపెన్ హెడ్ చానెల్స్ పునరుద్ధరణకు కృషి



బిర్లంగి ఓపెన్ హెడ్ చానెల్స్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇరిగేషన్ అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన 11 ఓపెన్ హెడ్ చానెల్స్, గ్రోయిన్స్ పునరుద్ధరణకు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. గురువారం జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలిసి ఇచ్ఛాపురం మండలంలోని ఓపెన్ హెడ్ చానెల్స్, గ్రోయిన్స్ పరిస్థితిని పరిశీలించారు. గ్రోయిన్స్ పాడైపోవడంతో పాతికేళ్లగా సాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని బిర్లంగి, బొడ్డబడ, బి.తోటూరు, మశాఖపురం, కొళిగాం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు నిల్వ చేసేందుకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో బహుదా నదిలో చేరి అక్కడి నుంచి సముద్రంలో వృథాగా కలిసిపోతోందని చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే కేశుపురం న్యూ గ్రోయిన్ పనులు పూర్తయ్యాయని, ఇరిగేషన్ అధికారులచే ఓపెన్ హెడ్ చానెల్స్, గ్రోయిన్స్ మరమ్మతులకు వేసిన అంచనా విలువలను త్వరలో జిల్లాకు రానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రతిపాదనలు సమర్పిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. చానెల్స్‌తో పాటు బహుదానది నీరు నిల్వ చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ పి.సుధాకరరావు, డిప్యూటీ ఈఈ జి.వి.రమణ, ఏఈఈ మధుసూదన పాణిగ్రాహి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్‌రెడ్డి, లిట్టూపాడీ, సంతోష్ మండల, చల్లా కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, లోపింటి దీనబంధురెడ్డి, తిప్పన కృష్ణారెడ్డి, బాకి లక్ష్మీనారాయణ, రంగాల జానీ, గండు మహాపాత్రో, రంగాల కృష్ణారెడ్డి, దక్కత జయదేవ్ పాల్గొన్నారు.

మళ్లీ వస్తా.. విద్యార్థులతో మాట్లాడతా..

- అంబేడ్కర్ వర్సిటీలో ఆర్.నారాయణమూర్తి సందడి



ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అడ్డయ్య, సిబ్బందితో ఆర్.నారాయణమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: 'యూనివర్సిటీ' సినిమా ప్రమోషన్ వర్కులో భాగంగా సీనియర్ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి గురువారం ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో స్నేహచిత్ర పిక్చర్స్‌లో ఈ సినిమా నిర్మించారు. వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్యను కలిసి విద్యార్థులతో మాట్లాడే అవకాశం కల్పించాలని కోరారు. అయితే ప్రస్తుతం సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని, మరోసారి రావాలని కోరారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ యూనివర్సిటీ సినిమాను ఆదరించాలని కోరారు. అక్టోబర్ 4న శ్రీకాకుళం పట్టణంలో యూనివర్సిటీ మూవీ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యా ప్రమాణాలు, రాజకీయ జోక్యం, విద్యార్థుల సమస్యలను సినిమాలో ప్రస్తావించామన్నారు. తప్పకుండా విద్యార్థులను ఆకట్టుకుంటుందన్నారు. మరోసారి విశ్వవిద్యాలయం సందర్శించి విద్యార్థులతో మాట్లాడతానని చెప్పారు.

రాష్ట్రస్థాయి అండర్-11 చెస్‌పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న యువనేత రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. అరసవల్లి రోడ్‌లో ఉన్న ఇందిరావిజ్ఞాన్ భవన్ వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ -11 ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్-2023 పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా 15కు పైగా టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చొక్కలింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, దరి సత్యన్నారాయణ ట్రస్ట్ అధినేత చౌదరి సతీష్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, మీట్ కన్వీనర్ సనపల అన్నాజీరావు, ఆర్గనైజర్ సనపల భీమారావు, చీఫ్ ఆర్బిటర్ జి.వి.కుమార్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, అప్పాయాదవ్ తదితరులు పాల్గొన్నారు. 8 రౌండ్లపాటు జరిగే ఈ టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులు అక్టోబర్ 1 నుంచి విశాఖపట్నంలో జరగనున్న జాతీయ స్థాయి అండర్-11 చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికవుతారని ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం


అదృశ్యమైన కూర్మినాయుడు

వంగర: మండల పరిధి సంగాం గ్రామానికి చెందిన వృద్ధుడు శనపతి కూర్మినాయుడు అదృశ్యంపై కేసు నమోదుచేశామని ఎస్సై ఆర్.జనార్దన రావు గురువారం తెలిపారు. ఈ నెల 1 నుంచి కూర్మినాయుడు కనబడడంలేదని కుమారుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హోంగార్డుకు చేయూత


హోంగార్డు గంగారావుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు ఎస్.గంగారావుకు చేయూతగా సహచర హోంగార్డులు ఒక్కరోజు జీతం అలవెన్స్ రూ.3 లక్షల 23వేల 760 వితరణగా ఇచ్చారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ ఎస్.గోపాలనాయుడు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్లుగా ఇద్దరికి రీపోస్టింగ్ ఆర్డర్స్

విజయనగరం ఫోర్ట్: ఇద్దరు ల్యాబ్‌టెక్నీషియన్లకు వైద్యారోగ్యశాఖ అధికారులు గురువారం రీ పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. సంతోష్, ప్రకాష్‌లు రెండేళ్ల క్రితం ల్యాబ్ టెక్నీషియన్లుగా విధుల్లో చేరారు. అయితే వారు విధుల్లో చేరినప్పుడు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల్లో ట్యాంపరింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో విధుల నుంచి తొలగించారు. దీంతో వారిద్దరూ తమకు ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా తొలగించారని హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలు పాటించకుండా విధుల నుంచి తొలగించారు కాబట్టి తిరిగి విధుల్లో చేర్చుకోవాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో వారిద్దరికీ రీపోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు.

ముద్దాయికి మూడు నెలల జైలు శిక్ష

చీపురుపల్లి: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడేళ్ల క్రితం జరిగిన చోరీ కేసులో ముద్దాయికి మూడు నెలల జైలుశిక్ష పడినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జనవరి 2న స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన చోరీకి సంబంధించి అప్పటి సబ్ రిజిస్ట్రార్ బీజీఎస్‌వీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణ అనంతరం గుర్ల మండలంలోని చింతలపేటకు చెందిన యడ్ల రామచంద్రను ముద్దాయిగా నిర్ధారించి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎం.విజయ రామేశ్వరి తీర్పునిచ్చినట్లు తెలిపారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం


బూరాడపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నెల్లిమర్ల రూరల్: మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెరపురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ స్వాతి సూచించారు. మండలంలోని బూరాడపేటలో మొక్కజొన్న పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగును గుర్తించి పలు సూచనలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కత్తెర పురుగు నివారణపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. లోతు దుక్కులు చేయడం వల్ల పురుగు కోశస్థ దశలు నాశనమవుతాయన్నారు. పురుగు ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే నష్టాన్ని నివారించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యాలయంగా
రేగులపాడు కేజీబీవీ

- స్టేట్ బెస్ట్ స్కూల్ అవార్డుకు ఎంపికపై కేజీబీవీ సిబ్బంది హర్షం
- అభినందించిన జిల్లా అధికారులు
- ఆగస్టు 15న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు ప్రదానం



స్టేట్‌లో బెస్ట్ పాఠశాలగా ఎంపికైన వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ

వీరఘట్టం:

విద్యార్థుల హాజరునమోదు.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన.. విద్యాలక్ష్యాలు చేరుకోవడంతో వీరఘట్టం మండలం రేగుగులపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. ఉత్తమ విద్యాలయంగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి కేజీబీవీ అధికారులకు గురువారం సమాచారం అందింది. రాష్ట్రంలో ఉన్న 352 కేజీబీవీలలో రేగులపాడు కేజీబీవీను బెస్ట్ కేజీబీవీగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడంపై సిబ్బంది, బాలికలు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది పనితీరును డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్, జీసీడీఓ రోజారమణి ప్రశంసించారు. కేజీబీ వీ ఎస్ఓ రోహిణికి ఫోన్‌చేసి అభినందనలు తెలిపా రు. ఆగస్టు 15న విజయవాడలో జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేయనున్నారు.

● అంచెలంచెలుగా...

వీరఘట్టం మండల కేంద్రంలో 2011 సెప్టెంబర్ 2వ తేదీన కేజీబీవీను ప్రారంభించారు. మొదటి రెండేళ్లు 6, 7, 8 తరగతులను నిర్వహించారు. 2013 నుంచి 6 నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన చేపట్టా రు. నాలుగేళ్ల పాటు వీరఘట్టంలోని ఓ ప్రవేటు భవనంలో కొనసాగిన కేజీబీవీ, తర్వాత రేగులపాడు వద్ద నిర్మించిన భవనంలోకి మార్చారు. 13 మంది బాలికలతో ప్రారంభమైన కేజీబీవీలో నేడు 222 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 6–10 తరగతి బాలికలు 197 మంది, ఇంటర్మీడియట్ ఫస్టియర్ బాలికలు 18 మంది, సెకెండియర్ బాలికలు ఏడుగు రు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం కార్పొరేటు స్థాయిలో సకల సౌకర్యాలు కల్పిస్తుండడంతో రేగులపాడు కేజీబీవీలో సీటుకు తీవ్ర పోటీ నెలకొంది.

● పదో తరగతిలో శతశాతం ఫలితాలు

ఏటా పదో తరగతిలో శతశాతం ఫలితాలే నేడు కేజీబీవీని రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిపాయి. పదో తరగతి ఫలితాల్లో అధికమంది అత్యధిక మార్కులు సాధించడం, ప్రతీ తరగతిలో గరిష్ఠంగా బాలికలు చేరడంతో పాటు హాజరుశాతం మెరుగ్గా ఉండడంతో ఈ ఏడాది బెస్ట్ కేజీబీవీగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు.

● ఉత్తీర్ణత శాతం ఇలా...

రేగులపాడు కేజీబీవీ బాలికలు 13 మంది తొలిసారి 2013లో పదోతరగతి పరీక్షలు రాసి శతశాతం ఉత్తీర్ణ త సాధించారు. 2013 నుంచి 2016 వరకు శతశాతం టెన్త్ ఫలితాలు సాధించారు. తర్వాత 2017లో 97 శాతం, 2018లో 93 శాతం, 2019లో 96 శాతం ఫలితాలు నమోదయ్యాయి. 2020 నుంచి 2023 వరకు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 2023లో 33 మంది బాలికలు పదోతరగతి పరీక్షలు రాయగా అందరూ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. 2022–23లో ప్రారంభించిన ఇంటర్మీడియట్ విద్య మొదటి బ్యాచ్‌లో చేరిన ఏడుగురూ ఉత్తీర్ణులయ్యారు.

మణిపూర్‌లో మారణహోమం నిరసిస్తూ శాంతి ర్యాలీ


అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మహమ్మద్ నాజిర్

విజయనగరం టౌన్: మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల ఫోరం ఆధ్వర్యంలో గురువారం విజయనగరం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ నాజిర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు, దళిత సంఘాల నాయకులు, ముస్లింలు ర్యాలీలో పాల్గొని మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న హింసను ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జంతువులకు ఉన్న విలువ మనుషులకు లేదన్నారు. ముఖ్యంగా మైనార్టీలైన ముస్లింలు, క్రైస్తవులు, బడుగు బలహీన వర్గాలకు లేకపోవడం బాధాకరమన్నారు. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.ఉదయ చంద్ర మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన వారే ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారన్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి ముర్ము వెంటనే జోక్యం చేసుకుని కేంద్రప్రభుత్వం ద్వారా మణిపూర్ రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని కోరారు. నేటికీ మూడు నెలలు పైబడినప్పటికీ ప్రధాని ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోవడం చాలా బాధాకరమన్నారు. ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అమీద్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసను వెంటనే నిలిపివేసి, హింసకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌ను కలిసి మెమొరాండం సమర్పించారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష్యుడు ఎస్.మధు, ఆలిండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం, బిషప్ ఎం.పాల్సన్,వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షురాలు ఆశాజాన్ డి.ఎలీషా, ఎల్.మధుసూదన్, పీఎస్.ప్రసాద్, పిల్లా ఆనందబాబు. బలరామ్ పాల్, జయప్రకాశ్, సత్యరాజ్, యబ్బోజు చౌదరి, ఆనంద్, మస్తాన్, వి.భూషణం, దళిత సంఘం నేతలు ఆదాడ మోహనరావు, సుహాసిని, పవన్, తదితరులు పాల్గొన్నారు.

డోర్ టు డోర్ సర్వే



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో ఓటరు లిస్టు వెరిఫికేషన్, ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం నిబంధనల మేరకు జరుగుతున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ మీనా ఇంటింటి ఓటరు సర్వేపై కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లతో గురువారం వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటింటి సర్వే వివరాలను తెలియజేస్తూ జిల్లాలో 2,74,327 డోర్ నంబర్‌లు ఉన్నాయని, వాటిలో 1,38,055 డోర్ నంబర్‌లను బీఎల్‌ఓలు వ్యక్తిగతంగా పరిశీలించారని, 2245 డోర్ నంబర్‌లు బీఎల్ఓ యాప్‌లో వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు నిండినవారు 4072మంది ఉండగా 4,020మంది నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులను స్వీకరించినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలతో ఇంతవరకు రెండుసార్లు సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ మంది ఓట్లు ఉన్న వారి వివరాలు, 100 ఏళ్లు దాటిన వారి వివరాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, సూపరింటెండెంట్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ పనులు వెంటనే పూర్తిచేయాలి

భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ పాంటేషన్ వెంటనే పూర్తిచేయాలని సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్ సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్‌లతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ఆర్ఓఆర్ పూర్తయిన గ్రామాలలో స్టోన్ పాంట్లేషన్ పూర్తిచేసినట్లు తెలిపారు. జిల్లాలో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రీసర్వే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ–కేవైసీ సకాలంలో పూర్తిచేస్తామని, ప్రభుత్వ భూములు, రోడ్లు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా ఫార్మసీ కళాశాలలో ఈ నెల 4వ తేదీ నుంచి జరుగుతున్న 'మహిళా ఆత్మరక్షణ' అవగాహన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. కళాశాల మహిళా సాధికార లింగ సున్నితత్వం కమిటీ సమన్వయకర్త కె.మాధవి, జిల్లా క్రీడా సాధికార సంస్థ కోచ్ ఎస్.రవి సంయుక్త పర్యవేక్షణలో విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ, ఆత్మస్థైర్యాన్ని కలిగించే క్రీడలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మూడు పశువుల వ్యాన్‌ల పట్టివేత


వ్యాన్‌లో పరిమితికి మించి తరలిస్తున్న ఆవులు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి సమీపంలో రాజాం నుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్న మూడు వ్యాన్‌లను ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అడ్డుకున్నారు. గురువారం రాజాంలో జరిగిన వారపు సంతలో పశువులను కొనుగోలు చేసి తరలిస్తుండగా అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యాన్‌లతో సహా పశువులను స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా పరిమితికి మించి తరలించడం నేరమని, ఒక్కో వ్యాన్‌లో ఆరు పశువులకు మించి తరలించరాదన్నారు. అయినప్పటికీ మూడు వ్యాన్‌లలో 36 పశువులను తరలించడంతో పశువుల అక్రమ రవాణా చట్టం కింద పశువులు తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు సీఐ కె.రవికుమార్ తెలిపారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు చేశామని, వాటిని కోర్టులో హాజరుపరచి, కోర్టు అనుమతితో పశువులను విడిచిపెట్టనున్నామని చెప్పారు.

ఆస్పత్రి ప్రసవాలను ప్రోత్సహించాలి

పార్వతీపురం: ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలను ప్రోత్సహించి, సాధారణ ప్రసవాలను పెంచాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో సర్వే నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలను సిఫార్సు చేయాలని సూచించారు. గడప గడపకు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, డీఎంహెచ్ఓ బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ తదితరులున్నారు.

రైలు కిందపడి ఆటోడ్రైవర్ మృతి


సంఘటనాస్థలంలో క్షతగాత్రులకు సపర్యలు చేస్తున్న 108 సిబ్బంది

బొబ్బిలి: రామభద్రపురం మండల కేంద్రానికి చెందిన గొర్లె చిన్నారావు(30)అనే ఆటో డ్రైవర్ రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ ఎస్. కృష్ణారావు తెలిపారు. బొబ్బిలి–డొంకినవలస స్టేషన్ల మధ్య బహిర్భూమికి వెళ్లి పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొందని చెప్పారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మృత దేహానికి సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

- చికిత్స పొందుతూ ఒకరి మృతి

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిలో గుచ్చిమివద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వారిలో ఇకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణానికి చెందిన పాట్నూరు దినేష్,, భార్య అముల్య పార్వతీపురంలో బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం సీతానగరంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పూజల కోసం పార్వతీపురం నుంచి బైక్‌పై వస్తుండగా గుచ్చిమి వచ్చేసరికి ఫోన్ వచ్చిందని రోడ్డు పక్కన ఆగి అమూల్య మాట్లాడుతుండగా వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో 108 సిబ్బంది వచ్చి సపర్యలు చేసి చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అముల్య చికిత్స పొందుతుండగా మృతి చెందింది. దినేష్ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీతానగరం ఎస్సై తెలియజేశారు.

న్యాయం కావాలి

- పోలీస్‌స్టేషన్‌లో మహిళ బైఠాయింపు
- బాధితురాలికి సీపీఎం నాయకుడి మద్దతు



పోలీస్‌స్టేషన్‌లో మెట్లపై బైఠాయించిన బాధిత మహిళ రాజ్యలక్ష్మి, సీపీఎం నాయకుడు జగన్,

వేపాడ: భర్త వల్ల మోసపోయాయని తనకు న్యాయం చేయాలంటూ వేపాడ మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన చప్ప రాజ్యలక్ష్మి వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించింది. ఈ మేరకు సీపీఎం నాయకుడు చల్లాజగన్‌తో పాటు బంధువు మద్దతుతో స్టేషన్‌కు వచ్చింది. ఇందుకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం దేవీబుచ్చంపేట గ్రామానికిచెందిన రాజ్యలక్ష్మికి పెద్దల సమక్షంలో 2023 మార్చి26న వేపాడ మండలం ఆతవ గ్రామానికి చెందిన చప్పకృష్ణతో సింహాచలంలో వివాహం జరిగింది. వివాహం అనంతరం కొన్ని రోజులు బాగానే ఉన్నారు. తర్వాత గొడవలు ప్రారంభమయ్యాయి. ఆమె ప్రస్తుతం గర్భిణి కావడంతో అబార్షన్ చేసుకోమని భర్త బలవంతం పెడుతున్నాడు. తాను అబార్షన్ చేయించుకోనని బిడ్డ ముఖ్యమని రాజేశ్వరి చెప్పడంతో అప్పటి నుంచి అత్తవారింట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. అత్తవారింటిలో పెట్టిన ఇబ్బందులు తట్టుకోలేక ఆమె తల్లికి ఫోన్‌చేసి జూన్ ఐదున పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త వ్యవహారంపై సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 7న ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త వల్లంపూడి పోలీసులకు భార్య రాజేశ్వరిపైఫిర్యాదు చేయడంతో పోలీసుల సమాచారం మేరకు వల్లంపూడి స్టేషన్‌కు ఆమె వచ్చి వాస్తవ విషయాలను పోలీసులకు వివరించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ బాధిత మహిళకు న్యాయం జరిగేవరకు తమమద్దతు అందిస్తామన్నారు. మహిళా చట్టాలు ఎన్ని ఉన్నా నేటికీ మహిళలు మోసపోతున్నారని బాధిత మహిళ రాజేశ్వరికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత


పల్లె వీధిలో పట్టుకున్న బియ్యం బస్తాల వద్ద విజిలెన్స్, సీఎస్‌డీటీ సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలోని పల్లె వీధిలో బియ్యం వ్యాపారి చీపురుపల్లి నర్సింగరావు ఇంట్లో 1600 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ తెలిపారు. విజిలెన్స్ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కస్టోడియన్‌కు అప్పగించారు. అలాగే మండలంలోని దేవుపల్లిలో బొగెర్ల శంకర రావు ఇంట్లో బియ్యం నిల్వలపై దాడులు నిర్వహించి 24 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, సీఎస్‌డీటీ సాయికృష్ణ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నిందితులపై 6ఎ కేసులు నమోదు చేశారు.

అధికారుల పర్యవేక్షణ అవసరం

- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, దేవి
- టీహెచ్ఆర్ రేషన్ పంపిణీ భేష్


మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, దేవి

విజయనగరం అర్బన్: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, ఎంఎల్ఎస్ పాయింట్లపై అధికారులు పర్యవేక్షణ మరింత పెరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ.లక్ష్మీరెడ్డి, జి.దేవి అభిప్రాయపడ్డారు. జిల్లా పర్యటన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో గురువారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో గమనించిన అంశాలను వివరించారు. మధ్యాహ్న భోజన పథకంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం చక్కని మెనూ అమలు చేస్తోందని, బడ్జెట్‌ను పెంచి, బిల్లులను కూడా త్వరగానే చెల్లిస్తోందన్నారు. పథకం అమల్లో క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల లోపాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వంటకు కావాల్సిన ఆహార పదార్థాలను అందిస్తున్నా నిర్వాహకులు వంట సరిగా చేయడంలేదన్నారు. కొన్నిచోట్ల మెనూ మార్చుతున్నట్లు గుర్తించామన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా వంట చేయడం లేదన్నారు. విద్యాశాఖాధికారులు, హెచ్ఎంలు పర్యవేక్షణ పెంచి రుచికరంగా వంట చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం శతశాతం మంది విద్యార్థులు తినేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ విధానం బాగుందని, రాష్ట్రంలోనే జిల్లా రెండో స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై శ్రద్ధ చూపాలన్నారు. సరుకుల స్టాక్ విషయంలో లోపాలను గుర్తించామన్నారు. కేజీబీవీల్లో సరుకులు పూర్తిగా అయిపోయిన వారం రోజుల వరకూ కొత్త సరుకులు రావడం లేదని, దీనివల్ల విద్యార్థులకు భోజనం సక్రమంగా అందడంలేదన్నారు. కాంట్రాక్టర్ల నుంచి హాస్టళ్లకు ఆహార పదార్థాల సరఫరా సక్రమంగా జరగడం లేదని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిహాస్టళ్లకు నాణ్యమైన సరుకులు సరఫరా అవుతున్నట్లు గుర్తించామన్నారు. ఎంఎల్ఎస్‌పాయింట్ల వద్ద కాటాలు సక్రమంగా లేవని, ఎండీయూ వాహనాలకు కొంత తక్కువ తూకంతో బియ్యం అందుతున్నాయని చెప్పారు. వీటిని సరిదిద్దాలని సూచించారు. సమావేశంలో డీఎస్ఓ కె.మధుసూదనరావు, సివిల్ సప్లై య్ డీఎం మీనాకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతికుమారి, డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, ఆహార భద్రతాధికారి వెంకటరమణ, సివిల్ సప్లై, ఐసీడీఎస్, విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్


అభివృద్ధి పనులపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ బాలాజీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణాలకు ఇప్పటికే శంకుస్థాపనలు పూర్తయ్యాయని, నాణ్యత ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా చైతన్య పరచాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

- జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం


రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం:

రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభా పాటవాలతో రాణించాలని సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ ఆకాంక్షించారు. విజయనగరం విజ్జి స్టేడియం ప్రాంగణంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ విభాగంలో బాల, బాలికలకు గురువారం ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరుకాగా.. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను సెట్విజ్ సీఈఓ అభినందిస్తూ విజేతలుగా రావాలని సూచించారు. పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.చారిప్రసాద్, కె.కావ్య, కె.చిట్టిబాబు పర్యవేక్షించారు.

కార్గోసేవలు మరింత చేరువ


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్ జోన్-1 అప్పలనాయుడు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ కార్గోసేవలను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు కళాసీలు, ఇతర సిబ్బంది కృషిచేయాలని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్ అండ్ కమర్షియల్) జోన్ 1 బి.అప్పలనాయుడు సూచించారు. విజయనగరం బస్‌స్టేషన్ ప్రాంగణంలోని పార్సిల్ సెక్షన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్గో పాయింట్లో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ కస్టమర్స్‌కు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా సేవలందించాలన్నారు. సకాలంలో పార్సిల్స్‌ను అందజేయాలని ఆదేశించారు. ఆర్టీసీ కార్గో సేవలు తక్కువ ఖర్చుతో అతిత్వరగా నిర్వహిస్తాయని రుజువుచేయాలన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ సీహెచ్.అప్పలనాయుడు, ఏటీఎం కమర్షియల్ హెచ్.దివ్య, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ పాల్గొన్నారు.